# కళాజ్యోతి

శ్రీ రాయసం సుందర వెంకటరమణ

[శేఖర్, రమణ సంతకు బయలుదేరివెళ్ళి అచ్చట ఎప్పటిలాగ ఒక పూలకొట్టుదగ్గర ఎప్పటియట్లు పూలన్నీ కొనేసి డబ్బిచ్చేసి బయలుదేరారు. ఆ రోజున ఆ పూలమ్మే పిల్లయొక్క తల్లితో మాట్లాడాలనే ఆసక్తితో పూలమ్ముకొని యింటికి బయలుదేరిన పిల్ల ముందు, వెనుక వారిద్దరు మెల్లగా గమ్యస్థానం చేరుకున్నారు. వాళ్ళిద్దరిని తల్లికి కళ పరిచయంచేసిన తరువాత శేఖర్, రమణ అరుగుమీద కూర్చున్నారు — యిక చదువండి.]

(గతసంచిక తరువాయి)

"నేమాటాడుతాను. నీవు భావికిపోయి నీళ్లు తెచ్చి వంట ప్రయత్నంచెయ్యి తల్లీ" అన్న ముసలావిడ మాటలు ముగియక ముందే కళ కడవను చంక పెట్టుకొని గుడిసె, వదలిపోయింది. "బాబుల్లారా! మీరు యెవరో మామీద యింత దయను చూపిస్తున్నందుకు నేనెంతో కృతజ్ఞురాలను. మేమేదో గంజి త్రాగి రామ కృష్ణ అనుకుంటూ యిలా కాలక్షేపం చేస్తున్నాము. మీ రెవరో, మా కెందు కింత దయకలిగిందో చెప్తారా" అంది. శేఖర్ నోట మాట రాలేదు. నావంక చూచాడు. నీవు కవి నంటావే. ఈవిడకు నచ్చ చెప్పు అని అతని చూపులోని అర్థం. నేకొద్దిగా నవ్వాను. ముసలి స్త్రీ వంక పరీక్షగా చూచాను. "అమ్మా మమ్ము లనుగూర్చి యెలాంటి దురభిప్రాయము పడ నవసరము లేదు. మేమిద్దరము చిన్ననాటి స్నేహితులము. ఒకరినొకరు బాగా అర్థం చేసుకొన్నాము. జరిగిన పది సంవత్సరాల నుంచి యిలా సంతకు వెళ్లి రావడం మా కలవాటు. ఐదారు నెలలగా మీ అమ్మాయి సంతలో పూలనమ్మడం చూచాము. శేఖర్ ఆమెపడే శ్రమ వేదనచూచి యెంతగానో బాధపడ్డాడు. శ్రమపడ్డాడు. అతంది జాలిహృదయం. ఏకష్టాన్ని చూచినా బాధపడే స్వభావం అతంది. తన కాఫీ డబ్బులతో పూల నన్నిటిని కొనేసేవాడు ప్రతిదినం. ఎన్నో సార్లు కళ ఒకప్పుడు బాగా బ్రతికిన సంసారంనుంచి వచ్చింది అని చెప్పుతుండే వాడు. ఆమె మాటలు, నడవడిక దానికి నిదర్శనాలు. "కళ ముఖంచూస్తే ఏదో అపరిమితమైన దయ, నిష్కారణమైన వాత్సల్యము కలుగుతుంది" అంటుంటాడు శేఖర్. స్వాభావికంగా మనము కొందరి

ముఖాలన్నా, మాటలన్నా, చేతలన్నా యెంతగానో యిష్టపడుతాం. మఱికొందఱివి అసహ్యించుకొంటాం. అది మానవ తత్వంలో కర్మ సిద్ధాంతంమీద ఆధారపడి వుంటుంది. మీరు బాగా బ్రతికివుంటే మీ గడచిన జీవితం మాకు చెప్పడానికి తప్పకుండా సంశయిస్తారు. మానవుడు మానవునికి సాయంచేసుకోడం తప్పా! విశ్వమానవ సౌభ్రాతృత్వమును పెంపొందించాలనే విషయము మీటింగుల్లో, వ్రాతల్లో ఉండిపొయ్యాయి. చెప్పినవన్ని చెయ్యగలిగితే అందరు గాంధీ మహాత్ములు కారా! కాబట్టి ప్రతివ్యక్తి తన బాధ తోడి మానవుడితో చెప్పుకున్నందువల్ల కొంత బరువు దిగ్గిపోయినట్లుంటుంది 'తలమీదినుంచి. అందువలన అమాయికత్వాన్ని, నేరాన్ని ప్రపంచానికి వెల్లడిచేసుకోవడమే వేదాంతంలో పరిపక్వమైనస్థితి అని మహనీయులు చెప్పారు. అందువల్ల మీరేమి సంశయించనక్కరలేదు. మేము చేతనయితే సహాయం చేస్తాము. లేకపోతే సానుభూతి చిహ్నంగా రెండు కన్నీటి బిందువులను రాలుస్తాం'' అన్నాను.

## ౪

ముసలావిడ కొంచెంగా దగ్గింది. తర్వాత చాలా ఆయాసపడింది కళ్లె వుమ్మేసింది నెత్తురుతో. మాట్లాడడానికి ప్రయత్నించింది. మాట గొంతునుంచి బయటికిరాలేదు. తర్వాత అరుగుమీద పడుకుంది. మళ్లీలేచింది. ''బాబుల్లారా! మీరంతగా అడుగుతుంటే నేను కాదనలేకపోతున్నా. మానిజమైన విషయము, మేమింతకుముందు గడిపిన జీవితం యీ దేవళం అర్చకుడుగారికితప్ప మరెవ్వరికి తెలియదు. తెలియపర్చాలనికూడా నా వుద్దేశ్యముకాదు.

మీరనుకొన్నట్లు నేను బాగా జీవితం గడపినదాన్నే. పుట్టింట, మెట్టినింట సిరి యెల్లప్పుడు నాట్యంచేసింది ఒకప్పుడు. ఇక్కడికి 15 మైళ్ల దూరములో నున్న భాగ్యవరం మా అత్తవారి యూరు. జ్యోతిపురం మా పుట్టిల్లు. నాకొక తమ్ముడుండేవాడు. మా తండ్రి గుమాస్తాగా చేసినా మాకెలాంటికొఱత రానియ్యలేదు. చాలా గారాబంగా పెంచారు మా తల్లిదండ్రులు. నేకాపురానికి వచ్చిన రెండు సంవత్సరాలకు మా తల్లి దండ్రులకు ప్రపంచంలో ఋణం తీరిపోయింది. మా తమ్ముడు గుమాస్తా అయ్యాడుకాని తర్వాత చెడుసావాసాలతో ఆస్తినంతా చెడగొట్టి మంచంబట్టి గతిలేనివాడికిమల్లె మరణించాడు'' అంటూ కళ్ళు తుడుచుకుంటూంది.

''భాగ్యవరంలో స్కూలు మేనేజరుగా నుండేవారు మావారు. ఒక మాదిరి యిల్లు. కొంత మాగాణివుంది. అదంతా వారి మేనత్త యిచ్చిన ఆస్తి. అందువల్ల

మేనత్త కూతుర్ని మొదటి వివాహం చేసుకొన్నారు. ఒక్క కొడుకును కని ప్రపంచాన్ని వదలింది ఆ మహనీయురాలు. వారప్పుడు పిచ్చివారయ్యారు. ఆయనకు యీ వూరిలో ఒక ఆఫీసరు స్నేహితుడు. ఆఫీసరుకు బిడ్డలు లేనందున ఆ పిల్లవాణ్ణి పెంచడానికి తీసుకున్నారు. ఆ ఆఫీసరుగారే నా వివాహాన్ని జరిపించారు తన మిత్రునితో. 5 సంవత్సరాలు కాపురంచేసిన తరువాత అప్పటి నుంచి మా చిట్టి తల్లికి కష్టాలు అంటూ కడవతో ప్రవేశించినవి'' జ్యోతి తల నిమురుతూ యిలా చెప్పసాగింది. ''కళా! అంటూ వాళ్ళ నాన్నగారు పిల్చేవారు. నా జీవితానికి వాళ్ళ తండ్రి పోయిన తరువాత వెలుగిచ్చింది కాబట్టి జ్యోతి అని నేపిలుస్తాను. కాబట్టి మా తల్లి కళా జ్యోతి. పాపం! ఎన్నో కష్టాలు పడింది పిచ్చితల్లి. తర్వాత 9 సంవత్సరాలు భాగ్యవరంలోనే వున్నాము. తర్వాత మా మరిదికి మామీద నిర్దయకలిగింది. ఆ స్థితిలోయున్నప్పుడు యీదేవాలయార్చకుడు మమ్ములను కనికరించి యిక్కడ తలదాచుకోడానికి నీడనిచ్చాడు. మరణిస్తూకూడా వీళ్ల తండ్రి కొడుకును నన్ను కన్న కొడుకు మాదిరిగా చూచుకోమన్నాడు. మాస్థితి యిలా వున్నప్పుడు నిక్షేపంలా జీవితం గడుపుతున్న నా చిట్టి తండ్రి జీవితాన్ని, భవిష్యత్తును నా చేతులార మా దగ్గిరకు తెచ్చి చెడపడం యిష్టం లేకపోయింది. నేను కనుమూసేలోగా మా జ్యోతిని చిట్టి తండ్రి చేతుల్లో పెట్టి వాణ్ణే దాని వివాహంచెయ్యమని ప్రార్థించడం, వారి సుఖాన్ని ఆశించడం నా ఆఖరు కోరిక'' అని కథ ముగించింది. దగ్గు మళ్ళీ వచ్చింది. ఉష్మ్మసి పడుకొంది ఆయాసపడుతూ. ''మీ తండ్రిగారి పేరేమిటి అమ్మా'' అన్నాను కళతో. ''శ్రీనివాసయ్య'' అంది జ్యోతి. ''మీ అన్నయ్య ఇక్కడ యెవరి దగ్గఱ వున్నాడు'' అన్నా. ''త్రిపుర శంకర్ గారింట్లో'' అని జవాబు.

నేను శేఖర్ స్థంబితులయ్యాము. ఒకరి వంక ఒకరు చూచుకొన్నాము పరీక్షగా. నాకు తెలుసు శేఖర్ మనస్సులో పెద్ద తుపాను చెలరేగింది. అమ్మా అంటూ ముసలమ్మ దగ్గఱకు చేరాడు శేఖర్. ''నేనే త్రిపుర శంకర్ గారి దత్తుకుమారుణ్ణి. మా తండ్రి ఆయనకే పెంచుకోడానికి నన్నిచ్చింది. అభాగ్యుణ్ణి, కన్న కొడుకంటే యేమిటో, వాత్సల్యమంటే యేమిటో నేనిప్పుడే తెలుసుకొన్నాను. తండ్రిగారు మరణించిన మూడు సంవత్సరాలకుగాని నాకు ప్రపంచం తెలియలేదు. అమ్మాయని! పిలిచేభాగ్యం యీ నాడు కలిగింద నా జీవితంలో. కళా నీవు నిజంగా కళా జ్యోతివి; నా సోదరివి. నీవు సంతలో

పూలమ్ముకోవడం – మీకే 'గుడిసె నివాసమా' అన్నాడు కన్నీటితో శేఖర్. 'ఈ నాటికైనా నిన్ను చూడగలిగాను. అదే పదివేలు' అంది ఆనంద భాష్పాలతో ముసలావిడె.

''అన్నయ్యా''అంది కళ ఆప్యాయంగా. ''శేఖర్'' అన్నాను నేను చిరునవ్వుతో.

ఇలా కథ ముగిసిందని చాలామంది పాఠక మహాశయులు నిరాశ చెందవచ్చును! ఒక్క సస్పెన్సుగాని, యీ కాలం యువకులకు సరిపడే పవిత్ర ప్రేమగాథగాని కాదని మరికొందరు ఆ క్షే పిం చ వ చ్చు గా ని యీచిన్న సంఘటన యెన్నోమార్లు నన్ను గర్వపడేటట్లు చేయడమేగాక యీ కథ వ్రాయడానికి యుద్యుక్తునిగా చేసింది. ఇంకా సంతకు పోతూనే యున్నాము నేను, శేఖర్.

— —(o)——

ఖైరా జిల్లాకు చెందిన చారోటార్‌లో ఇంటింట ప్రతిరోజూ పెళ్లిళ్లు జరిగాయట. లగ్నంకోసం ఆగడం కాని, కట్నంకోసం బేరాలాడ్డంగాని లేదు! నవంబర్ తర్వాత దక్షిణాఫ్రికాకు కొత్తగా భారతీయులను శాశ్వతంగా వలసకురానివ్వరాదని మలాన్ ప్రభుత్వం నిర్ణయించడంకారణంగాగబగబా పెళ్ళిళ్లు చేసుకొని భార్యలను నవంబర్‌లోగా దక్షిణాఫ్రికాకు తీసుకొని వెళ్లడానికి యువకులు, ముఖ్యంగా పటేల్ తెగవారు ఆదరా బాదరా వివాహాలు చేసుకోసాగారట!

పిల్లా సుబ్బారావుశాస్త్రి


# సౌ భా గ్య

గాంధీజీ నిర్మాణకార్య క్రమంలో ఒక అంశమైన మహిళాభ్యుదయాన్ని సాధించే ఉద్దేశంతో ఆంధ్ర ప్రభుత్వం స్త్రీ జనాభ్యుదయ శాఖను నిర్వహిస్తున్నది.

స్త్రీల విజ్ఞాన వికాసాలకు దోహదమిచ్చే రచనలతో 'సౌభాగ్య' అనే సచిత్రమాస పత్రిక ప్రచురింప బడుతున్నది. సాంఘిక సంక్షేమం 'సౌభాగ్య' ఆశయం. అందరికీ అందుబాటులో ఉండేటట్లు విడిప్రతి 3 అణాలు సాలుచందా (పోస్టేజీతో సహా) రెండురూపాయిలు ఏర్పాటు చేయబడింది.

'సౌభాగ్య' ప్రతులకు, స్త్రీ జనాభ్యుదయ శాఖను గురించిన యితర వివరాలకు ఈ క్రింది చిరునామాకు వ్రాయండి.

ఎడిటర్, 'సౌభాగ్య'

1, ఈస్ట్ స్పర్‌టాంక్ రోడ్, మద్రాసు-8